



RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0



ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :300 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శనివారం 26 సెప్టెంబర్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad




# గంగమ్మ ఒడికి... ఖైరతాబాద్ మహాగణపతి

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి

69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం

క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం

పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక

**హైదరాబాద్ సింధూరదర్శిని:** హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఉదయం 9.30గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుడి ఎదుట డ్యాన్స్ చేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా మిగతా 2లో...

# పారిశ్రామికవేత్తల్లో స్ఫూర్తి...

ఆంధ్రప్రదేశ్‌కు ఖ్యాతి తెచ్చేలా విశాఖ పెట్టుబడుల సదస్సు - ఎంఎస్ఎంఈలకు ప్రాధాన్యతనిచ్చేలా 5 ప్రాంతాల్లో 5 రీజినల్ కాన్ఫరెన్సులు

పార్టనర్షిప్ సమ్మిట్-2026 సన్నాహకాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు - 30 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకూ శంకుస్థాపన



**అమరావతి సింధూరదర్శిని:** పార్టనర్షిప్ సమ్మిట్-2026కు సన్నాహకంగా రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో 5రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, అనంతపురం, తిరుపతిలో రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించాలని, ప్రాజెక్టులకు ఎంవోయూలు జరగాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఆయా ప్రాంతాల ప్రత్యేకతలు, పెట్టుబడి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని చర్చలు నిర్వహించాలన్నారు. విశాఖపట్నంలో నవంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించనున్న 31వ సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్-2026కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సన్నాహక కార్యక్రమాలపై గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. భాగస్వామ్య సదస్సు కేవలం ఎంవోయూల కోసం కాకుండా... ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తినింపేలా, ఏపీ బ్రాండింగ్ మరింత పెరిగేలా నిర్వహించాలన్నారు. అలాగే పెట్టుబడులతో పాటు... మిగిలిన అంశాలపైనా సదస్సులో చర్చ మిగతా 2లో...

# దీన్‌దయాళ్ ఆలోచనలే వికసిత్ భారత్‌కు దిక్సూచి: ప్రధాని మోదీ

దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా మోదీ నివాళి

వ్యక్తి ప్రగతి సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంతమని వెల్లడి

అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనేదే అంత్యోదయ లక్ష్యమని వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథాన్ని అందించిన మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తే బీజేపీకి, తమ ప్రభుత్వాల నిర్ణయాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. వ్యక్తి ప్రగతి సమాజం నుంచి వేరుగా కాకుండా, సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంత సారమని చెప్పారు. ప్రకృతిని దెబ్బతీయకుండా సమాజం పురోగమించేలా అభివృద్ధి నమూనా ఉండాలని ఆయన ఆలోచనలు చెబుతాయని వివరించారు. దీన్ దయాళ్ జయంతి సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మిగతా 2లో...

## మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

విజయవాడలో తొలిసారి నేషనల్ సరస్ ప్రదర్శన

ఏర్పాట్లను పరిశీలించిన కేంద్రమంత్రి పెమ్మసాని

మహిళా సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని వ్యాఖ్య



**విజయవాడ సింధూరదర్శిని:** మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, వారి ఆర్థిక సాధికారతను పెంపొందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'నేషనల్ సరస్ ప్రదర్శన' ఏర్పాట్లను రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మహిళా స్వయం సహాయక సంఘాల మిగతా 2లో...

## నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు

37 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం: నాదెండ్ల మనోహర్

విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాప్

రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్న నాదెండ్ల

ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడి



**అమరావతి సింధూరదర్శిని:** ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని నవంబర్ 1న ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో పౌర సరఫరాల శాఖ నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడిన ఆయన, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు, రవాణా, మిల్లింగ్ ప్రక్రియకు సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. సేకరణ ప్రక్రియ కోసం 24వేల మంది సిబ్బందిని నియమించగా, కల్లాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడించారు. ఈసారి రైతులకు రవాణా ఖర్చులు కూడా చెల్లించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.

ఎల్‌నినో ప్రభావం కారణంగా పంట దిగుబడులు, తద్వారా ధాన్యం సేకరణ అంచనాలు తగ్గినట్లు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అయినప్పటికీ, రైతుల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా సకాలంలో కొనుగోలు చేయడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రవాణా, గోనె సంచుల సరఫరా, మిల్లుల సామర్థ్యం, చెల్లింపుల ప్రక్రియ వంటి అంశాల్లో పౌరసరఫరాల శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలను భాగస్వామ్యం చేసేందుకే ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన తర్వాత చెల్లింపులు ఆలస్యం కాకుండా ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని చెప్పారు.

## వివేకా హత్య కేసు.. ఈడీ విచారణకు హాజరైన సునీల్ యాదవ్

వరుసగా రెండో రోజు సునీల్ యాదవ్‌ను విచారిస్తున్న ఈడీ

మనీలాండరింగ్, హవాలా కోణంలో ప్రశ్నిస్తున్న అధికారులు

నిన్న తొమ్మిది గంటల పాటు విచారించిన ఈడీ అధికారులు



**అమరావతి సింధూరదర్శిని:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఏపీ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన దర్యాప్తును మరింత తీవ్రతరం చేసింది. ఈ హత్య వెనుక భారీ ఎత్తున మనీలాండరింగ్, హవాలా లావాదేవీలు జరిగాయన్న బలమైన ఆధారాలతో రంగంలోకి దిగిన ఈడీ అధికారులు, కేసులో కీలక నిందితుడిగా ఉన్న సునీల్ యాదవ్‌ను హైదరాబాద్‌లోని తమ ప్రాంతీయ కార్యాలయంలో వరుసగా రెండో రోజు కూడా సుదీర్ఘంగా విచారిస్తున్నారు. నిన్న ఒక్కరోజే సునీల్ యాదవ్‌ను అధికారులు దాదాపు తొమ్మిది గంటల పాటు ప్రశ్నించారు. ఈ సమయంలో, హత్య జరిగిన కాలంలో చోటుచేసుకున్న అనేక అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు, మిగతా 2లో...

# పొర్లుకట్టలో అభివృద్ధికి బాటలు వేసిన మంత్రి నారాయణ

### రూ.55 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి



నెల్లూరు( సింధూరదర్శిని)25 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని 48వ డివిజన్ పొర్లుకట్ట ప్రాంతంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శుక్రవారం పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా రూ.48 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, రూ.7 లక్షలతో చేపట్టనున్న లైటింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. మహిళల విజ్ఞప్తి మేరకు 27 మరుగుదొడ్ల నిర్మాణానికి మంత్రి ఆమోదం తెలిపారు. వర్షాకాలంలో పొర్లుకట్ట ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. రోడ్డు నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీ మేరకు పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ప్రాంతానికి మెరుగైన కనెక్టివిటీ కల్పించడంతో పాటు లైటింగ్ సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రోడ్డు నిర్మాణం సంద ర్భంగా ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఇళ్లు పూర్తిగా తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడితే ప్రత్యామ్నాయంగా ఇళు కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పొర్లుకట్ట ప్రాంతంలో 27 మరుగుదొడ్ల నిర్మాణ పనులను శని వారం నుంచి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండేలా మౌలిక వసతులు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలను దశలవారీగా అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. స్థానిక ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవడం పట్ల మహిళలు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రికి మహిళలు మంగళహారతులు ఇచ్చి, పూలవర్షంతో స్వాగతం పలికారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ స్థానిక ప్రజలు రోడ్డు సమస్యను మంత్రి దృష్టికి తీసుకువచ్చిన వెంటనే స్పందించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం అభినందనీయమన్నారు. రోడ్డు, లైటింగ్ సౌకర్యాలతో పాటు మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ నెల్లూరు నగరంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పేద ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, విద్య తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ భానుప్రతాప్, కార్పొరేషన్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్న స్థానికులు

గూడూరు (సింధూర దర్శిని) 25 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని బాలాజీ నగర్ లో నూతనంగా ఏర్పడిన లే అవుట్ లో సెల్ టవర్ నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకున్నారు. గూడూరు పట్టణంలో స్థానిక బాలాజీ నగర్ పరిధిలోని రమణారెడ్డి లేఅవుట్‌లో జియో సంస్థ చేపడు తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని స్థానిక ఫ్లాట్ల కొనుగోలుదారులు మరియు నివాసితులు అడ్డుకున్నారు. స్థానికులు మాట్లాడుతూ మేమ ఫ్లాట్లు కొనుగోలు చేశామని ఇల్లు నిర్మించుకోవాలని భావిస్తుంటే, ఉన్నపలంగా ఈ సెల్ టవర్ నిర్మించడం ఏంటని ప్రశ్నించారు. ఈ టవర్ వల్ల రేడియేషన్ ప్రభావం పడి, ఇక్కడ నివాసముంటున్న వృద్ధులు, చిన్న పిల్లలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఆరోగ్యాన్ని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ ప్రైవేట్ సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## వందేమాతర గీతం యొక్క విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాలి



గూడూరు( సింధూర దర్శిని) 25 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల గూడూరులో శుక్రవారం విద్యా భారతి ఆంధ్ర ప్రదేశ్ వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వందేమాతరం దేశవ్యాప్తంగా కోటిగళాలతో పాడించాలనే లక్ష్యంతో శిశు మందిర్ పాఠశాలలో పూర్తి వందేమాతరం పాటించడం అలాగే వందేమాతర గీతం యొక్క విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ముఖ్య అతిథులు పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళి రెడ్డి, కమిటీ సభ్యులు రావూరు రవి చంద్ర, వాకాటి రామమోహన్, లలిత పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా మన పాఠశాలలోనే కాకుండా డి ఆర్ డబ్ల్యు దువ్వూరు రమణమ్మ ఉమెన్స్ జూనియర్ కాలేజ్, మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్ మరియు చిల్లకూరు శేషమ్మ పాఠ శాలలలో కూడా వందేమాతర గీతాన్ని పాడించి విశిష్టతను తెలియ జేయడం జరిగింది. మొత్తం 700మంది విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

## జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ బాధ్యతలు స్వీకరణ



నెల్లూరు( సింధూర దర్శిని) 25 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్, సభ్యుల పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్‌కు సంబంధించిన పరిపాలనా బాధ్యతలను కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వసుమతి, పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల అభివృద్ధి టిడిపితోనే : ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్






గూడూరు (సింధూరదర్శిని) 25 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; అంగన్వాడీ వర్కర్లకు టిడిపి ప్రభుత్వం లోనే జీతాలు పెంచడం జరిగిందని ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయని ప్రభుత్వం వాటిని పరిష్కరిస్తుందని చిన్న బిడ్డలను తమ బిడ్డలుగా అంగనవాడి వర్కర్లు ఎంతో ప్రేమగా చూసుకోవడం సంతోషం కలిగిస్తుందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాల యంలో అంగన్వాడి ఉత్సవం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గర్భిణీలకు సామూహిక సీమంతాలు అంగన్వాడీ టీచర్లను సన్మానించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీలకు ఏదైనా మేలు జరిగిందంటే అది టిడిపి ప్రభుత్వం లోనే అని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అంగన్వాడీలకు ఏమి చేయలేదని చిన్నపిల్లలను తల్లిదండ్రుల తర్వాత అంత ప్రేమగా అంగన్వాడీ వర్కర్లు చూసుకుంటారని మీ సమస్యలు ఇంకా కొన్ని ఉన్నాయని ప్రభుత్వం వాటిని పరిష్కరిస్తుందని వెల్లడించారు. ఎక్కడైనా అధ్వానంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల వివరాలను తెలియజేస్తే త్వరలో నూతన బిల్డింగ్ నిర్మాణానికి చర్యలు తీసుకుం టామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో మోహన్, ఐసిడిఎస్ సిడిపిఓ షేక్ మెహబూబి, నాయకులు బిల్లు చెంచురామయ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కందుకూరు నియోజకవర్గం పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి, లైవ్ స్టాక్ డైరెక్టర్ గుండాల లీలావతి, అంగన్వాడీ వర్కర్లు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నిర్దేశించిన విధులను నిబద్ధతతో నిర్వహించాలి

### కమిషనర్ వై ఓ. నందన్



నెల్లూరు (సింధూరదర్శిని)25 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి నిర్దేశించిన విధులను నిబద్ధతతో నిర్వహించాలని కమిషనర్/ అదనపు ఎన్నికల అధికారి వై.ఓ. నందన్ సూచించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఎన్నికలకు సంబంధించిన అధికారులు సిబ్బందితో సమీక్ష సమా వేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ఆదేశాలను పాటిస్తూ విభాగాల వారీగా తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించా లని సూచించారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ, ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేలా ప్రతిఒక్క సిబ్బంది తమ వంతు కృషి అందజేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ హిమబిందు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టి.పి.ఆర్.ఓ వాసుబాబు, సిటీ ప్లానర్ రఘునాథరావు, సెక్రటరీ శ్రీలక్ష్మి, ఎగ్జామినర్ శంకర్ నారాయణ రెడ్డి, మేనేజర్ రాజేశ్వరి, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజాభివృద్ధిలో జర్నలిస్టులదే కీలక పాత్ర

### ఆల్ ఇండియా రేడియో మాజీ డైరెక్టర్ వేణుగోపాల్




గూడూరు (సింధూర దర్శిని) 25 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; స్వాతంత్ర ఉద్యమం నాటి నుండి ప్రజలను పత్రికలు చైతన్య పరుస్తూ పనిచేస్తున్నా యని సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల కీలక పాత్ర వహిస్తారని కాలానుగుణంగా మారుతున్న టెక్నా లజీ పై అవగాహన పెంచుకోవాలని ఆలిండియా రేడియో మాజీ డైరెక్టర్ వేణుగోపాల్ వెల్లడిం చారు. గూడూరు పట్టణంలో జరిగిన నేషనల్ వర్క్ షాప్‌లో ఆయన పాల్గొన్నారు. గూడూరు పట్టణంలోని ఎస్కేఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో వన్డే నేషనల్ వర్క్ షాప్ అండ్ జర్నలిజం రిపోర్టింగ్ అండ్ ఎడిటింగ్ టెక్నాలజీ కార్యక్రమం నిర్వహించారు అతిథిగా ఆల్ ఇండియా రేడియో మాజీ డైరెక్టర్ నాగసూరి వేణుగోపాల్ పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు. ముందుగా సరస్వతి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు ముఖ్యఅతిథి వేణుగోపాల్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలలో జర్నలిజం లో అనేక మార్పులు వచ్చాయని పత్రికలు రేడియో టీవీలు సెల్ ఫోన్ ఇంటర్నెట్ సోషల్ మీడియా విస్తృతంగా ఉన్నాయని అన్నారు సమాజంలో ఎన్నో సమస్యలు ను జర్నలిస్టులు వెలుగులోకి తీసుకు వస్తారని మారుతున్న సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని నిబద్ధత నిజాయితీగా వార్తలు అందించాలని సూచించారు. మరో అతిథి ఫార్మర్ సబ్ ఎడిటర్ విశాలాంధ్ర నేషనల్ డైలీ తిమ్మప్ప మాట్లాడుతూ ఒకప్పుడు వ్యవస్థగా పనిచేస్తున్న పత్రికా రంగం నేడు వ్యక్తుల పరంగా మారిపోయిందని సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. సమాజంలో సమస్యలపై విద్యార్థుల అవగాహన పెంచుకోవాలని పత్రిక మరియు ఎలక్ట్రానిక్ మీడియాలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెన్నెల కంటి శ్రీధర్ ,ప్రిన్సిపాల్ రాంప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి ,కన్వీనర్ సురేంద్ర, రమణారెడ్డి ,అధ్యాపకులు జర్నలిస్టులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మాటల ప్రభుత్వం కాదు-చేతల ప్రభుత్వం

**వెంకటగిరిలో సుడిగాలి పర్యటన చేసిన మంత్రి నారాయణ - అన్నా క్యాంటీన్‌లో ప్రజలతో కలిసి భోజనం.**

**మున్సిపల్ అధికారులతో అభివృద్ధిపై సమీక్ష- వెంకటగిరి అభివృద్ధికి - పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ**



వెంకటగిరి (సింధూర దర్శిని) 25 సెప్టెంబర్ తిరుపతి జిల్లా ; వెంకటగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో శుక్రవారం మంత్రి సుడిగాలి పర్యటన చేశారు. ఎమ్మెల్యే కురుగొండ్లతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి, పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దిశానిర్దేశం చేశారు. అనంతరం అన్నా క్యాంటీన్‌ను మంత్రి నారాయణ ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ ప్రజలతో కలిసి భోజనం చేస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎస్టీబీ ప్లాంట్‌ను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల నిత్యావసరాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గత ప్రభుత్వం తొలగించిన 204 అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడంతో పాటు అదనంగా మరో 70 క్యాంటీన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వెంకటగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి కేవలం 5కోట్లు కేటాయిస్తే, కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే 192 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. పట్టణాభివృద్ధికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పనులు జరుగుతున్నాయని అన్నారు. 123 మున్సిపాలిటీల అభివృద్ధికి 50 వేలకోట్లను సీఎం చంద్రబాబు నాయుడు మంజూరు చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయకపోవడంతో కేంద్రం నుంచి వచ్చిన వేల కోట్ల నిధులను వినియోగించుకోలేక పోయామన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆగిపోయిన పనులను తిరిగి పట్టాలెక్కిస్తున్నామని తెలిపారు. నిలిచిపోయిన నీటి సరఫరా ప్రాజెక్టులను పునరుద్ధరిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. వైసీపీ నేతలకు రాష్ట్రాన్ని పాలించడం తెలియదన్నారు.పరిపాలన చేతకాక వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడి అపార అనుభవంతో ఇప్పుడు అన్ని వ్యవస్థలు గాడిలో పడుతున్నాయని. ఆగిపోయిన అభివృద్ధి పనులన్నీ తిరిగి ప్రారంభమవుతున్నాయని తెలిపారు.2014లో కేంద్రం నుంచి 5,350 కోట్ల నిధులు తీసుకొచ్చామని, వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో రాష్ట్ర వాటా అందకపోవడంతో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వాటిని తిరిగి వేగవంతం చేస్తోందన్నారు. గతంలో మాటలే తప్ప పనులు కనిపించలేదని,ఇప్పుడు పనులు మాట్లాడుతున్నాయన్నారు. వెంకటగిరి అభివృద్ధికి గత ప్రభుత్వం ఐదేళ్లలో 5 కోట్లు కేటాయిస్తే ,రెండేళ్లలో కూటమి ప్రభుత్వం 192 కోట్లు కేటాయించిందని తెలిపారు.మాటల ప్రభుత్వానికి, చేతల ప్రభుత్వానికి ఉన్న తేడా అదే అని ఉదహరించారు.

# పార్టీలకతీతంగా సీఎం సహాయ నిధి





**ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్**

గూడూరు (సింధూరదర్శిని) 25 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; పార్టీలకతీతంగా సీఎం సహాయనిధి అంది స్తున్నామని పేదవాడి ఆరోగ్య విషయంలో నాయకులు రాజకీయాలు చేయవద్దని ఎవరికైనా సీఎం సహాయనిధి కావాలంటే పార్టీ కార్యాల యంలో సంప్రదించాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి నుండి మంజూరైన 58 లక్షల రూపాయల 122 చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అందజేశారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత శుక్రవారం 29వ సారి సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్నామని గత వైసిపి ప్రభుత్వంలో ఒక్కరికి కూడా సీఎం సహాయనిది ఇవ్వలేదని గుర్తు చేశారు. సహాయ నిధి పొందిన వారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని గుర్తుంచుకో వాలని పనిచేసే ప్రభుత్వాన్ని మరలా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి,పులిమి శ్రీనివాసులు ,మునిగిరేష్, గుండాల లీలావతి, హరికుమార్, వెంకటేశ్వరరాజు, దశరథ రామిరెడ్డి , వైయస్సార్, భాస్కర్ రెడ్డి ,పలు మండలాల నాయకులు కార్యకర్తలు సీఎం సాయనిధి లబ్ధిదారులు పాల్గొన్నారు.

# యూనిఫాం గౌరవాన్ని పెంచుతుంది-బాధ్యతను కూడా పెంచుతుంది

**పోలీసు విధుల్లో నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావం కీలకం - 231 మంది ఎస్ సి టి పి సి లకు మంత్రి నారాయణ అభినందనలు**



వెంకటగిరి (సింధూర దర్శిని) 25 సెప్టెంబర్ తిరుపతి జిల్లా ; పోలీసు యూనిఫాం కేవలం ఉద్యోగానికి గుర్తింపు కాదని,అది ప్రజల నమ్మకానికి, ప్రభుత్వ బాధ్యతకు, క్రమశిక్షణకు, సేవాభావానికి ప్రతీక అని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలోని 9వ బెటాలియన్‌లో నిర్వహించిన 2026 బ్యాచ్ ఏపీ ఎస్ పి పాసింగ్ అవుట్ పరేడ్‌లో మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 231 మంది ఎస్ సి టి పి సి అభినందించారు. మంత్రి నారాయణకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ,9వ బెటాలియన్ కమాండెంట్ రామచంద్రమూర్తి ఘన స్వాగతం పలికారు. పరేడ్‌ను తిలకించిన మంత్రి ,శిక్షణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 9వ బెటాలియన్ నిర్వహించిన ఏ పి ఎస్ పి పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పోలీసు శాఖలో సేవలు ప్రారంభించేందుకు సిద్ధమైన ఎస్ సి టి పి సి శుభాకాంక్షలు తెలిపారు. ఈ రోజు వారి జీవితంలో ఎంతో ముఖ్యమైన రోజని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్‌కు రాష్ట్ర పోలీసు వ్యవస్థలో ప్రత్యేకమైన స్థానం ఉందని మంత్రి తెలిపారు. శిక్షణలో ప్రావీణ్యం పొంది, ప్రజా సేవ పట్ల బాధ్యతతో కూడిన పోలీసు సిబ్బందిగా వారు విధుల్లోకి అడుగుపెడుతున్నారని అన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు సేవ చేయడమే ప్రధాన కర్తవ్యంగా భావించాలని సూచించారు.పోలీసు విధుల్లో కొన్ని సందర్భాలు అత్యంత క్లిష్టంగా ఉంటాయని, అలాంటి సమయాల్లో ధైర్యం, సంయమనం, సమయస్ఫూర్తితో వ్యవహరించాలని అన్నారు.విధి నిర్వహణలో ఉన్నప్పుడు వ్యక్తిగత ప్రవర్తన కూడా పోలీసు శాఖ ప్రతిష్ఠతో ముడిపడి ఉంటుందని పేర్కొన్నారు. నిజాయితీ, నిబద్ధత, సమయ పాలన, క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. చట్టాన్ని గౌరవిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ, సహచరులతో సమన్వయంతో విధులు నిర్వహించాలని అన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ప్రతి అనుభవం మరింత సమర్థవంతమైన పోలీసు సిబ్బందిగా తీర్చిదిద్దుతుందని చెప్పారు.

**తల్లిదండ్రుల త్యాగాన్ని మరువొద్దు**

ఈ స్థాయికి చేరుకోవడంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, త్యాగం ఎంతో ఉందని మంత్రి నారాయణ అన్నారు. ఈ రోజు ధరించిన యూనిఫాం వెనుక కుటుంబ సభ్యుల ఆశలు, కష్టాలు, ప్రార్థనలు ఉన్నాయని గుర్తుంచుకోవాలని సూచించారు. తమ ప్రతి విజయాన్ని కుటుంబ సభ్యులతో పంచుకోవాలని, వారికి గౌరవం ఇవ్వాలని కొత్తగా విధుల్లోకి అడుగుపెడుతున్న పోలీసు సిబ్బందికి సూచించారు.

**సేవా జీవితానికి ఐదు సూత్రాలు**

పోలీసు సిబ్బంది తమ సేవా జీవితంలో ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన ఐదు ముఖ్యమైన విషయాలను మంత్రి నారాయణ సూచించారు.

1. క్రమశిక్షణను ఎప్పుడూ వదులుకోవద్దు.
2. ఎవరూ చూడని సమయంలో కూడా నిజాయితీగా ఉండాలి.
3. కష్టమైన పరిస్థితుల్లోనూ ధైర్యంగా నిలబడాలి.
4. ప్రజల బాధను అర్థం చేసుకుని మానవతా దృక్పథంతో స్పందించాలి.
5. సహచరులతో కలిసి సమిష్టిగా పనిచేయాలి.

ఈ ఐదు విలువలను జీవితంలో పాటిస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలరని మంత్రి నారాయణ ఆకాంక్షించారు.



# దరి చేరకుండా "నులి పురుగులను" నలిపెద్దాం

**హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు**

చాపాడు( సింధూర దర్శిని) 25 సెప్టెంబర్ కడప జిల్లా; చాపాడు మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం విజయవంతం అయినట్లు నక్కల దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.ఓబులేసు చాపాడు యంపి డి ఓ మధుసూదన్ తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఓబులేసు, యంపిడిఓ మధుసూదన్ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమం దిగ్విజయంగా, సమర్థవంతంగా చిన్న గురువలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగినట్లు యంపి డి ఓ మధుసూదన్, డాక్టర్ ఓబులేసు తెలిపారు. ముఖ్యంగా నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని అన్ని గ్రామాలలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు మాధ్యమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఉన్నత విద్యా సంస్థలలో ప్రభుత్వ, మరియు ప్రవేట్ అనే తారతమ్యం లేకుండా ఒక సంవత్సరం నుండి, పంతొమ్మిది సంవత్సరాల లోపు, కౌమార దశలో విద్యార్థులకు, ప్రతి ఒక్కరికీ ఆల్బెండజోల్ మాత్రలను ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం సంవత్సరానికి రెండు సార్లు నిర్వహిస్తారని డాక్టర్ తెలియజేశారు. ఈ మాత్రలు పరాన్నజీవి పురుగులను తొలగించడానికి వాడే ఔషదం అని అన్నారు. పురుగుల నుండి రక్షణ ఇస్తుంది, ఆరోగ్యంగా ఉండేందుకు సహాయ పడుతుంది,మాత్ర నమిలి మింగాలని, తర్వాత మంచి నీళ్లు తాగాలన్నారు.

# తిలక్ నగర్ అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి ఉత్సవం

**ముఖ్య అతిథిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్. సంపూర్ణమ్మ**



గూడూరు (సింధూర దర్శిని) 25 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; అంగన్వాడీ ఉత్సవం ఐసిడిఎస్ గూడూరు ప్రాజెక్ట్ పరిధిలోని తిలక్ నగర్ అంగన్వాడి కేంద్రం నందు అంగన్వాడీ ఉత్సవం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో ఉదయం తల్లులకు పిల్లలకు అంగన్వాడీ కార్యకర్త జి. రాదామని స్వాగతం పలికి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్ సంపూర్ణమ్మ హాజరై గర్భిణీలకు బాలింతలకు పిల్లలకు అందించే సేవలు వివరాలు తెలిపారు. మరియు పోషణ ప్రదర్శన నిర్వహించినారు. పోషకాహార పదార్థాలు సమానాలు స్థానిక ఆహార పదార్థాలు ప్రదర్శించారు. ప్రభుత్వ పథకాలు అవగాహన పోషణ ట్రాకర్ ఇతర పథకాలపై అవగాహన కల్పిం చారు. ఆరోగ్యశాఖ సిబ్బంది ఏఎన్ఎం ఆశా వర్కర్ అవగాహన కల్పించి ముఖాముఖి లబ్ధిదారులతో నిర్వహించారు. అంగన్వాడీ సేవలు మీకోసంఅనే నినాదంతో రంగ రంగ వైభవంగా ముగింపు జరిగినది రెండవ రోజు పోషణ ఆరోగ్యం మరియు బాలల కార్యక్రమాలు మూడవరోజు ఈ సి సి ఈ మరియు పిల్లల ప్రతిభ ముగింపు కార్యక్రమాలు నిర్వహించడం జరుగు తుందని నిర్వాహకులు అంగన్వాడీ కార్యకర్త జి రాదామని తెలిపారు. పై కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ మస్తానయ్య హెల్త్ అసిస్టెంట్ నూర్ ఏఎన్ఎం సునీత కుమారి ఆశ లీలావతి మహిళా పోలీస్ ఎం విజయలక్ష్మి మరియు గర్భవతులు బాలింతలు టి హెచ్ ఆర్ పిల్లల తల్లులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీసుల తనిఖీల్లో భారీగా గంజాయి పట్టివేత

**గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముగ్గురు నిందితుల అరెస్ట్**

**42 గంజాయి ప్యాకెట్లు, రెండు కార్లు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం**

**కేసును ఛేదించిన కావలి రూరల్ పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల**



కావలి (సింధూరదర్శిని) 25 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా పోలీసులు ప్రత్యేక నిఘా మరియు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు.ఈ క్రమంలో 24.09.2026 న సుమారు రాత్రి 7 గంటల సమయంలో కావలి మండలం ముసునూరు టోల్ ప్లాజా సమీపంలోని ఎన్ హెచ్-16 రహదారిపై బట్లదిన్నె గ్రామానికి వెళ్లే సిమెంట్ రోడ్డు వద్ద కావలి రూరల్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, ఒంగోలు వైపు నుంచి నెల్లూరు వైపు వస్తున్న రెండు కార్లు పోలీసులను గమనించి అకస్మాత్తుగా వెనుదిరిగి వెళ్లేందుకు ప్రయత్నించాయి. అనుమానం వచ్చిన పోలీసులు రెండు వాహనాలను చుట్టుముట్టి తనిఖీ చేయగా, వాటిలో 42 ప్యాకెట్లలో మొత్తం సుమారు 92.79 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# రైల్వే కోడూరు నియోజకవర్గంలో 8 మద్యం షాపుల కేటాయింపునకు ఆన్‌లైన్ దరఖాస్తులు

## -సి.ఐ. టి.కె. తులసి-



రైల్వే కోడూరు సింధూరదర్శిని:
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పరిధిలో ఖాళీగా ఉన్న 8 మద్యం షాపుల కేటాయింపునకు సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సి.ఐ. టి.కె. తులసి ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీ ఏ 4 2026-27 ప్రకారం ఈ కేటాయింపుల ప్రక్రియను చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 8 షాపులు ఖాళీగా ఉన్నాయని, వాటిలో రైల్వే కోడూరులో ఆరు, ఓబులవారిపల్లెలో ఒకటి, చిట్వేలులో ఒక షాపు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారిక పోర్టల్ ౹ాతీశీష్ట్రఱఎఓఱశీఅ ఖఅస జుఇ౹ఎఱంవ ఐవజుఝఖతీఎవత్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు సమర్పించడానికి అక్టోబర్ 1వ తేదీ రాత్రి 12:00 గంటల వరకు గడువు ఉందని, ఆ తర్వాత సమర్పించిన దరఖాస్తులను పరిశీలించబోరని స్పష్టం చేశారు. అందుకున్న దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ అక్టోబర్ 3వ తేదీన జరుగుతుందని సి.ఐ. వివరించారు. పరిశీలన ముగిసిన అనంతరం అర్హత సాధించిన అభ్యర్థుల సమక్షంలో, తిరుపతి జిల్లా కలెక్టర్ నేతృత్వంలో పారదర్శకంగా లాటరీ పద్ధతి ద్వారా ఈ షాపులను కేటాయించడం జరుగుతుందని తెలియజేశారు. దరఖాస్తు నమోదు ప్రక్రియలో గానీ, నిబంధనలలో గానీ ఏవైనా సందేహాలు ఉన్న అభ్యర్థులు స్థానిక రైల్వే కోడూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించి సమాచారం తెలుసుకోవచ్చని సూచించారు.

# రైల్వే కోడూరులో ఘనంగా పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు



రైల్వే కోడూరు, సింధూరదర్శిని: రైల్వే కోడూరు పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏకాత్మ మానవతావాద సిద్ధాంతకర్త, ప్రాతఃస్మరణీయులు శ్రీ పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారి జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. సమాజంలోని చివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందాలనే ఆయన ఆశయం, 'అంత్యోదయ' సిద్ధాంతం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని కార్యకర్తలు కొనియాడారు. దేశ సేవ, ప్రజా సేవ మరియు నిస్వార్థ రాజకీయ విలువల కోసం పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చూపిన మార్గం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు, సమాజ సేవలో ప్రతి కార్యకర్త ముందుండాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సాయం శ్రీధర్, మండల పదాధికారులు కాళప్పగారి రాము, కుప్పాల కిరణ్, సీనియర్ నాయకులు జయప్రకాష్ నారాయణ వర్మ, వాకచర్ల సుబ్బారావు, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి కుప్పాల జ్యోతి, యువ మోర్చా జిల్లా కార్యదర్శి సాయి ఆచారి, నాయకులు వెంకటసుబ్బయ్య, అందరివాడు సుబ్బారావు, సందీప్, సుమంత్ మరియు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పండిత్ దీనదయాళ్ కి నివాళులర్పించారు. అనంతరం పండిత్ దీన దయాల్ జయంతి సందర్భంగా పట్టణంలోని తులసి ఎడ్యుకేషనల్ స్కూల్ నందు వికసిత్ భారత్ 2047 అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది ఈ యొక్క పోటీలలో గెలుపొందిన వారికి నేడు అనగా శనివారం జ్ఞాపకలను అందజేయపడుతుందని బిజెపి మండలాధ్యక్షులు సాయం శ్రీధర్ తెలిపారు.

# గర్భిణీలకు పౌష్టికాహారం పై అవగాహన కార్యక్రమం

ముద్దనూరు, సింధూరదర్శిని: ముద్దనూరు అంగన్వాడి ప్రాజెక్టు పరిధిలోని ఎస్సీ, ఎస్టీ కాలనీ, పలు అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం సిడిపిఓ ఓబులమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీ మాసోత్సవాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిల్లలు, తల్లులు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. వైవిధ్యభరితమైన ఆహారాన్ని తీసుకోవాలని, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను ఆహారంలో ఎక్కువగా చేర్చుకోవాలని అంగన్వాడీ కేంద్రం పరిధిలోని సిబ్బందికి సూచించారు. పోషకాహారం ద్వారా పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు మెరుగవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్త నాగమణి, బాలింతలు గర్భిణీ స్త్రీలు పిల్లలు పాల్గొన్నారు.



# మా స్థలం పై అసత్య ప్రచారాలు తగవు

**మాకు ఆధారాలు ఉన్న స్థలాన్నే మేము శుభ్రం చేసుకున్నాం - మా పార్టీకి చెందిన నాయకులపై ద్సపచారం చేయడం తప్పు**

**మాపై చేసిన ప్రచారాలకు పరువునష్టం దావా వేస్తాం - మట్లి సహకార సొసైటీ చైర్మన్ అప్పలనేని నాగరాజ నాయుడు**



రాయచోటి సింధూరదర్శిని:
మా స్థలానికి సంబంధించి అన్ని ఆధారాలు మా వద్ద ఉన్నాయి. ఆ స్థలాన్ని మేము ఇటీవల శుభ్రం చేసుకున్నాం. కానీ స్థలం మాది అని మా గ్రామానికి చెందిన తాండ్ర స్వామికొండ , ఆయన భార్య కళావతి ఇద్దరూ కొందరు వైసీపీకి చెందిన కార్యకర్తల ప్రోద్బలంతో ప్రతి రోజు దుష్ప్రచారం చేస్తున్నారు. వీడియోలు తీసి వైసీపీకి చెందిన వారి సహకారంతో సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తుండడం మాకు మనో వేదనను కలిగిస్తోంది. అందులో మా పార్టీకి చెందిన నాయకుల పేర్లు కూడా వాడుకుంటూ దుష్ప్రచారాలు చేస్తున్నారు. దీనిపై మేము పరువునష్టం దావా వేస్తాం...అని మట్లి సహకార సొసైటీ చైర్మన్ అప్పలనేని నాగరాజ నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలో నేతాజీ కూడలి సమీపంలో అదే గ్రామానికి చెందిన గుదె వెంకట్రామ్ ప్రసాద్, యద్దలపల్లి నంద కుమార్, సంతోష్, మరి కొందరితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాగరాజ నాయుడు మాట్లాడుతూ మా స్వగ్రామం వీరబల్లి మండలం మట్లి పెద్దూరులో నంబా నాగభూషణం, నంబా నగేష్ లకు చెందిన స్థలాన్ని వారి దగ్గర మా తండ్రి వెంకటసుబ్బయ్య 2002 సంవత్సరంలో కొన్నారు. అప్పటి నుంచి స్థలం మా అధీనంలోనే ఉన్నది. ఇటీవల మా అన్నదమ్ములం మాకు చెందిన ఆస్తిని బాగా పరిష్కారాలు చేసుకోవాలని నిర్ణయించి పెద్ద మనుషుల సమక్షంలో స్థలాన్ని మాతమ్ముడు అప్పలనేని నాగార్జున కు నేను ఈ నెల 11 వ తేదీన రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించాను. కానీ మా ఊరికి చెందిన తాండ్ర స్వామికొండ కుటుంబ సభ్యులు భూ వివాదం కారణంగా వారికి చెందిన ఆస్తులను కొన్ని ఏళ్లుగా బంజరు పెట్టుకున్నారు. తాండ్ర స్వామికొండ, ఆయన భార్య కళావతి ఇద్దరు గత కొన్ని రోజుల క్రితం మా ఇంటి దగ్గరకు వచ్చి మీ స్థలంలో కొద్ది రోజుకు చెత్త వేసుకుంటాం అని అడిగారు. మానవతా దృక్పథంతో మేము ఆలోచించి కొద్దిరోజులు వేసుకోండి అని చెప్పాము. ఇటీవల మా అన్నదమ్ములం బాగపరిష్కారం చేసుకునే క్రమంలో అక్కడ ఉన్న చెత్త దిబ్బను తీసివేయాలని తెలియజేయగా అలాగే తొలగిస్తాం అని భార్యాభర్తలు ఇద్దరు చెప్పారన్నారు. కానీ మాకు తెలియకుండా తాండ్ర స్వామికొండ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు అని తెలిసి మా స్థలంలో మేము శుభ్రం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

రాజంపేటలో ఒకటే పార్టీ అది తెలుగుదేశం పార్టీ, గ్రూప్ రాజకీయాలు గాని వర్గ రాజకీయాలు గాని మారాష్ట్ర నాయకులు కానీ మా జిల్లా నాయకులు కానీ ప్రోత్సహించరు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పార్టీ చాలా క్రమశిక్షణ గల పార్టీరాజంపేట అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్ రాజు ఆధ్వర్యంలో మేమంతా కలిసికట్టుగా పార్టీ కోసం పని పనిచేస్తాం భూ సమస్యకు పార్టీ ఎటువంటి సంబంధం లేదు కొందరు కావాలని మా నాయకులపై దుష్ప్రచారం చేస్తున్నారు.కానీ కొందరు వైసీపీకి చెందిన కార్యకర్తల ప్రోద్బలంతో మాపై కేసు పెట్టడమే కాకుండా విడియోలు తీయించి సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. అంతే కాకుండా మా పార్టీకి చెందిన నాయకులపై కూడా దుష్ప్రచారాలు చేస్తున్నారని, వారికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. మాకు చెందిన స్థలంలో మేము శుభ్రం చేసుకోవడం తప్పా.., మానవతా దృక్పథంతో కొద్ది రోజులు చెత్త వేసుకోండి అని చెప్పడం తప్పా అని అడుగుతున్నానన్నారు. మాపై, మా నాయకులపై తప్పుడు ఆరోపణలు, ప్రచారాలు చేసిన వారిపై పరువునష్టం దావా వేస్తామని తెలిపారు. అధికారులు సమగ్ర విచారణ చేపట్టి మాకు న్యాయం చేయాలని కోరుతున్నానన్నారు.

# రైల్వేకోడూరులో వైభవంగా 'ప్రజాదర్బార్'

**సమస్యల పరిష్కారానికి ముక్కా రూపానంద రెడ్డి హామీ**



రైల్వే కోడూరు సింధూరదర్శిని:
రైల్వే కోడూరు మండలంలోని రాఘవరాజుపురంలో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి ఆధ్వర్యంలో 'ప్రజా దర్బార్' కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు, అర్జీదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ వ్యక్తిగత, ప్రాంతీయ సమస్యలపై వినతులు సమర్పించారు. ప్రతి ఒక్కరి నుంచి వినతిపత్రాలను స్వీకరించిన రూపానంద రెడ్డి వారి సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు.
కొన్ని తక్షణ సమస్యలపై వెంటనే స్పందిస్తూ, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వేగంగా పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యలపై ప్రత్యేక ఆరా తీశారు. ఏ గ్రామానికి ఎలాంటి మౌలిక వసతులు అవసరమో ప్రజలను నేరుగా అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు.
ఈ సందర్భంగా ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో గుర్తించి, త్వరితగతిన పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తాం. గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతాం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ సీఎం వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



చిట్వేలి సింధూరదర్శిని: తాడేపల్లిలోని వైకాపా కార్యాలయంలో గురువారం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వైకాపా రాష్ట్ర నిర్వహణ మండలి సభ్యుడు, రైల్వేకోడూరు మండల అధ్యక్షుడు రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో చిట్వేలు మండలం తిమ్మాయిపాలెం గ్రామానికి చెందిన వైయస్సార్ సిపి గల్ఫ్ అడ్వైజర్, రెడ్డిస్ అసోసియేషన్ కమిటీ గౌరవ అధ్యక్షులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ?పార్టీ బలోపేతానికి మరింత ఉత్సాహంతో పనిచేయాలని, ప్రజల పక్షాన నిలబడి నిరంతరం అందుబాటులో ఉండాలని 2029 లక్ష్యంగా పార్టీ నేతలు కష్టపడాలని వైయస్ జగన్ తెలిపినట్లు నాగిరెడ్డి అన్నారు. అనంతరం రాజంపేట పార్లమెంట్ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని, అలాగే వైఎస్ఆర్సిపి సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని, వైఎస్ఆర్సిపి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. గల్ఫ్ లో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు చేపడుతున్న అభివృద్ధి పనులను, పార్టీ కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడుతున్న విధానాన్ని నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వారికి వివరించారు. అనంతరం నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తో పాటు ఆయన కుమారుడు నాగిరెడ్డి నిరంజన్, మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్, సాంబత్తిన నవీన్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్వాడీ ఉత్సవాలను విజయవంతం చేయండి

చిట్వేలి సింధూరదర్శిని: ఈ నెల 25 నుండి అక్టోబర్ 7వతేది వరకు జరిగే అంగన్వాడీ ఉత్సవాలలో భాగంగా కుమ్మర వీధి, మేదర వీధి, చిట్వేలీ -1, చిట్వేలీ -2, చిట్వేలీ -3 అంగన్వాడీ కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అంగన్వాడి ఉత్సవ కార్యక్రమాలు మండలం అంతా నాలుగు విడతలుగా ఒక్కొక్క అంగన్వాడీ కేద్రంలో మూడు రోజులు నిర్వహించడం జరుగుతుందనీ సిడిపిఓ సూపర్వైజర్ వసుంధరమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సూపెర్వైజర్ వసుంధరమ్మ మాట్లాడుతూ లబ్ధిదారులకు అంగన్వాడీ కేంద్రం నుండి ఏమేమి అందుతున్నాయి, వాటి యొక్క ప్రయోజనాలు, అంగన్వాడీలలో నిర్వహించే సామాజిక వేడుకలు, ప్రీ స్కూల్ కార్యక్రమాలు, అలాగే ప్రతి నెలా పిల్లల బరువులు తీసి వారి యొక్క స్థితిని గురించి తల్లులకు వివరించడం జరుగుతుంది. అలాగే నావచేతన స్క్రీనింగ్ యాప్ ద్వారా పిల్లల వివరాలు నమోదు చేయుట పి.ఎం.ఎం.వివై గురించి వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ



కార్యకర్తలు, ఆయాలు, స్థానిక గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

# మొత్తం గుడ్డు తినాలా లేదా గుడ్డులోని తెలుపు మాత్రమే తినాలా? ఈ రెండింటిలో ఏది మంచిది?

గుడ్లలో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. కాబట్టి ఇది చాలా కాలం కడుపులో సంపూర్ణ భావనను ఇస్తుంది మరియు మిమ్మల్ని చురుకుగా ఉంచడానికి సహాయపడుతుంది. గుడ్లు శరీరంలో శక్తిని నిలుపుకోవడంలో సహాయపడతాయి. కానీ గుడ్డు ఎలా తినాలి - మొత్తం గుడ్డా లేదా గుడ్డులోని తెలుపు మాత్రమేనా? గుడ్డు చుట్టూ వివిధ నమ్మకాలు, అపోహలు మరియు వాస్తవాలు ఉన్నాయి. రోజూ మొత్తం గుడ్లు తినడం ద్వారా ఆరోగ్యం ప్రభావితమవుతుంది, కాబట్టి గుడ్డులోని పచ్చసొనను తొలగించి, తెల్లని పదార్థం మాత్రమే తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయని కొందరు నమ్ముతారు, మొత్తం గుడ్లు శారీరక ఆరోగ్యానికి మరింత అనుకూలంగా ఉంటాయని కొందరు నమ్ముతారు. కాబట్టి ఈ గందరగోళాన్ని పరిష్కరించడానికి ఈ పోస్ట్ మీకు సహాయపడుతుంది. పోషణ పరంగా మొత్తం గుడ్డు ఎలా మంచిది? మొత్తం గుడ్లలో గుడ్డు యొక్క తెలుపు కంటే ఎక్కువ పోషకాలు ఉంటాయి. వాటిలో విటమిన్లు ఎ, బి 6, బి 12, డి, ఇ, కె, కోలిన్ మరియు ఫోలేట్ ఉంటాయి. కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, సోడియం మరియు సెలీనియం వంటి ఖనిజాలకు గుడ్లు మంచి మూలం. ఇది కాకుండా, గుడ్డులోని పచ్చసొనలో ఆరోగ్యకరమైన కొవ్వు మరియు మంచి కొలెస్ట్రాల్ ఉంటాయి. ఈ పోషకాలు తరచుగా గుడ్డులోని పచ్చసొనలో కనిపిస్తాయి. మహిళలు ఉన్నట్టుండి బరువు పెరగడానికి కారణాలేంటి ? మొత్తం గుడ్లలో పోషకాలు దీని నుండి మనం గుడ్డు మొత్తం గుడ్డులో లేని వివిధ పోషకాలను కలిగి ఉందని తెలుసుకోవచ్చు. మొత్తం గుడ్డులో 5 గ్రాముల ప్రోటీన్ మరియు 60 కేలరీలు ఉంటాయి. గుడ్డులోని పచ్చసొనలో ఒకే మొత్తంలో ప్రోటీన్ కలిగి ఉంటుంది. కాని 20 కేలరీలు మాత్రమే కలిగి ఉంటుంది మరియు పూర్తిగా కొవ్వు రహితంగా ఉంటుంది. రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది నార్త్ కరోలినా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఒక అధ్యయనంలో గుడ్డు మొత్తం తీసుకోవడం రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని కనుగొంది. మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను







నివారించడానికి గుడ్డులోని పచ్చసొనలోని కోలిన్ ఉత్తమమైన మార్గంగా గుర్తించబడింది. గుడ్డు పచ్చసొనలోని కెరోటినాయిడ్ కళ్ళకు మంచిది. కళ్ళ క్రింద నల్లగా వలయాలను నివారించడానికి ఇది మంచిది. పచ్చసొన తినడం లేదా ? ఐతే పోషకాలు కోల్పోయినట్టే తెల్లని సొనలో పోషకాలు బరువు తగ్గించే ప్రణాళికను అమలు చేస్తున్న వారు తక్కువ కేలరీలు తినడానికి మొత్తం గుడ్లు తినకుండా ఉండగలరు. గుడ్డులోని తెల్లసొనలో ప్రోటీన్, కాల్షియం, పొటాషియం, సోడియం, మెగ్నీషియం, భాస్వరం ఉంటాయి. బరువు తగ్గడానికి ప్రయోజనకరమైనది ఎందుకంటే గుడ్డులో తెల్లని పదార్థం పూర్తిగా కొవ్వు లేకుండా ఉంటుంది. మీరు ఒక రోజులో మీకు కావలసినన్ని తెల్ల గుడ్లను తీసుకోవచ్చు. గుండె జబ్బులు మరియు డయాబెటిస్ ఉన్నవారు కూడా గుడ్డులోని తెల్ల పదార్థంను తీసుకోవచ్చు. రోజులో మీరు ఎన్ని గుడ్లు తీసుకోవాలి? గుడ్డు వినియోగం చెడు కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది మరియు గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందనే అపోహను చాలా మంది నమ్ముతారు. గుడ్లు తినడం ఆరోగ్యకరమైనదని, మితంగా తినడం వల్ల ఎటువంటి హాని లేదని వివిధ వైద్యులు ఇప్పటికీ పేర్కొన్నారు. గుడ్లు వండకుండా తెల్ల సొన తినకుండా ఉండటం చాలా ముఖ్యం. హార్ట్ ఫౌండేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా మీరు వారానికి 8 మొత్తం గుడ్లు తీసుకోవచ్చని చెప్పారు. గుడ్డు తెల్లగా తీసుకోవ టానికి ఒకే ప్రమాణం లేదు. మీకు నచ్చినంత ఎక్కువ తెల్లని పదార్థంను తీసుకోవచ్చు. సేంద్రీయ గుడ్లు మంచివి అయితే వివిధ రకాల గుడ్లు ఉన్నాయి. సేంద్రీయ గుడ్లు లేదా వండని కోడి గుడ్లు ఆరోగ్యంగా భావిస్తారు. బోనులలో పెంచిన కోళ్ళ నుండి పొందిన గుడ్ల కన్నా మొక్కలను స్వతంత్రంగా తినిపించే కోళ్ళు అధిక నాణ్యత కలిగినవిగా భావిస్తారు. గుడ్డు తీసుకోవడం గురించి మీరు అయోమయంలో ఉంటే, మీరు ధైర్యంగా సేంద్రీయ గుడ్లను కొనుగోలు చేయవచ్చు మరియు తినవచ్చు. ఈ గుడ్లు కేజ్డ్ గుడ్ల కన్నా కొంచెం ఖరీదైనవి అయినప్పటికీ, అవి ఆరోగ్యకరమైనవి. ముగింపు మొత్తం గుడ్డు మరియు గుడ్డులోని తెలుపు రెండూ మీ ఆరోగ్యానికి మంచివి. వాటి పోషక విలువలో తేడా మాత్రమే ఉంటుంది. మొత్తం గుడ్లలో విటమిన్లు మరియు ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. గుడ్డులోని తెల్లని పదార్థంలో తక్కువ కేలరీలు ఉంటాయి. బరువు తగ్గాలనుకునే వ్యక్తులు, కండరాల బలాన్ని పొందాలనుకునే వ్యక్తులు, వివిధ వైద్య పరిస్థితులు ఉన్నవారు గుడ్డులోని తెల్లని పదార్థం మాత్రమే తినవచ్చు. మరికొందరు రోజుకు ఒక గుడ్డు మొత్తం తీసుకోవచ్చు.



# ఆసియా క్రీడల విజేతలకు సీఎం విజయ్ భారీ నజరానా

**4×400 మీటర్ల మిక్స్‌డ్ రిలే రేసులో భారత్‌కు రజత పతకం**

**జట్టులో తమిళనాడు అథ్లెట్లు విద్య రామరాజ్, విశాల్**

**చెరో రూ. 50 లక్షల నజరానా ప్రకటించిన సీఎం**

సింధూరదర్శిని:ఆసియా క్రీడల్లో పతకాలు సాధించి దేశానికి, తమిళనాడు రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన అథ్లెట్లకు ముఖ్యమంత్రి విజయ్ భారీ నగదు ప్రోత్సాహకాలను ప్రకటించారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడంలో ప్రభుత్వం ముందుంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. 4×400 మీటర్ల మిక్స్‌డ్ రిలే రేసులో భారత్‌కు రజత పతకం అందించిన జట్టులోని తమిళనాడు అథ్లెట్లు విద్య రామరాజ్, విశాల్‌లకు చెరో రూ. 50 లక్షల నజరానా ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఎక్స్ వేదికగా వెల్లడించింది. వీరికి తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ (శాప్)కి చెందిన 'ఎలైట్ స్పోర్ట్స్‌పర్సన్ స్కీమ్' కింద ఈ ఆర్థిక సాయం అందనుంది. ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన భారత మహిళా క్రికెట్ జట్టులోని తమిళనాడు యువ క్రీడాకారిణి జి. కమలినికి విజయ్ రూ. 75 లక్షల నజరానా ప్రకటించిన విషయం తెలిసిందే. "4ఐ400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో రజత పతకం సాధించిన భారత అథ్లెట్లకు శుభాకాంక్షలు. నలుగురు సభ్యులున్న భారత జట్టులో ఇద్దరు తమిళనాడుకు చెందిన క్రీడాకారులు ఉండటం మన రాష్ట్ర క్రీడా రంగానికి గర్వకారణం. విద్య రామరాజ్, విశాల్ సాధించిన ఈ విజయం క్రీడల్లో రాణించాలనుకునే యువతకు గొప్ప స్ఫూర్తినిస్తుంది. భవిష్యత్‌లో వీరిద్దరూ మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి తమిళనాడుతో పాటు భారత్‌కు మంచి పేరు తీసుకురావాలి" అని సీఎం విజయ్ ప్రశంసించారు. 4×400 మీటర్ల మిక్స్‌డ్ రిలే విభాగంలో విద్య రామరాజ్, విశాల్, మను, పూవమ్మలతో కూడిన భారత బృందం 3:14.46 సెకన్లలో రేసును పూర్తి చేసి రజతాన్ని కైవసం చేసుకుంది. బహ్రెయిన్ జట్టు 3:12.87 సెకన్ల టైమింగ్‌తో గేమ్స్ రికార్డు నమోదు చేస్తూ స్వర్ణాన్ని గెలుచుకుంది. ఆసియా క్రీడల మిక్స్‌డ్ రిలే విభాగంలో భారత్‌కు ఇది వరుసగా మూడో పతకం కావడం విశేషం. 2018లో స్వర్ణం, 2022లో రజతం గెలిచిన భారత జట్టు, మరోసారి రజత పతకంతో మెరిసింది.

# చమురు ధరలు తగ్గడంతో దూసుకెళ్లిన మార్కెట్లు..

**సెన్సెక్స్ 315 పాయింట్లు జంప్**

**77 పాయింట్లు పెరిగి 23,140 వద్ద ముగిసిన నిఫ్టీ**

**105 డాలర్ల చేరువలో ట్రేడైన బ్రెంట్ బ్యారెల్ ధర**

**అమెరికా-ఇరాన్ ఒప్పందంపై పెరిగిన ఆశలు**

**ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియల్టీ రంగాల్లో లాభాలు**

**ఐటీ, మీడియా, ఫార్మా, హెల్త్‌కేర్ సూచీలకు నష్టాలు**



దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. ముడి చమురు ధరలు తగ్గడం, అమెరికా-ఇరాన్ మధ్య దశలవారీ ఒప్పందంపై ఆశలు మార్కెట్లకు ఊతమిచ్చాయి. గురువారం భారీగా పడిపోయిన సూచీలు శుక్రవారం కోలుకున్నాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 315 పాయింట్లు లాభపడి 73,895 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 77 పాయింట్లు పెరిగి 23,140 వద్ద ముగిసింది.

నిఫ్టీ బ్యాంక్ 389 పాయింట్లు ఎగబాకి 55,762 వద్ద స్థిరపడింది. అమెరికా-ఇరాన్ మధ్య దశలవారీ ఒప్పందానికి సంబంధించి చర్చలు జరుగుతున్నాయన్న వార్తలు మదుపర్లలో ఆశలు పెంచాయి. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా ఈ చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. దీంతో మధ్యప్రాచ్యం నుంచి చమురు సరఫరాలు సాధారణ స్థితికి వచ్చే అవకాశాలపై అంచనాలు పెరిగాయి. చమురు ధరలు కూడా దిగివచ్చాయి. గత రెండు సెషన్లలో 7 శాతానికి పైగా పెరిగిన బ్రెంట్ క్రూడ్ శుక్రవారం బ్యారెల్‌కు 105.6 డాలర్లకు చేరువగా ట్రేడైంది. డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 94 డాలర్ల దిగువన కొనసాగింది. అయితే మార్కెట్లకు కొన్ని ప్రతికూల అంశాలు ఇంకా ఉన్నాయి. అమెరికా ట్రెజరీ ఈల్డ్స్ 5 శాతానికి పైగా ఉండటం, విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగడం, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులపై ఆందోళనలు మార్కెట్లపై ఒత్తిడి పెంచుతున్నాయి. విస్తృత మార్కెట్లలో మిశ్రమ పరిస్థితి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.23 శాతం నష్టపోగా.. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.17 శాతం లాభపడింది. నిఫ్టీ నెక్స్ట్ 50 కూడా 0.39 శాతం పెరిగింది. ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియల్టీ రంగాల సూచీలు వరుసగా 0.76 శాతం, 0.87 శాతం, 0.70 శాతం లాభపడ్డాయి. ఐటీ, మీడియా, ఫార్మా, హెల్త్‌కేర్ సూచీలు మాత్రం నష్టాల్లో ముగిశాయి.

# హోటళ్లలో బెడ్‌షీట్లు తెల్లగానే ఎందుకుంటాయో తెలుసా? అసలు కారణం ఇదే!

**శుభ్రతకు ప్రతీకగా మారిన తెల్లటి బెడ్‌షీట్లు - మరకలు సులభంగా కనిపించడం ప్రధాన కారణం**

**అతిథుల్లో ప్రశాంతతను కలిగించే తెలుపు - హోటళ్లకు లాండ్రీ నిర్వహణ సులభం - తెలుపుతో గది విశాలంగా ఉందనే భావన**



హోటల్ గదిలోకి అడుగుపెట్టగానే ముందుగా కనిపించేది ఏంటి? చక్కగా సర్దిన మంచం.. దానిపై మెరిసిపోతున్న తెల్లటి బెడ్‌షీట్! స్టార్ హోటల్ అయినా, చిన్న లాడ్జి అయినా ఈ తెల్లటి షీట్లకు మాత్రం ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇది కేవలం అందం కోసం తీసుకున్న నిర్ణయం కాదు. దాని వెనుక చరిత్రతో పాటు మనస్తత్వానికి సంబంధించిన కారణాలు, హోటళ్ల నిర్వహణకు ఉపయోగపడే వ్యాపార లెక్కలు కూడా ఉన్నాయి.

**తెలుపు వెనుక చరిత్ర**

ఎప్పటి నుంచో తెలుపును పరిశుభ్రత, స్వచ్ఛతకు ప్రతీకగా చూస్తున్నారు. విక్టోరియన్ కాలంలో హోటళ్లకు వచ్చే అతిథుల్లోనూ తెల్లటి వస్త్రాలు శుభ్రతపై నమ్మకాన్ని పెంచేవి. మరకలు, మురికి సులభంగా కనిపిస్తాయి గనక తెల్లటి వస్త్రాలు పరిశుభ్రంగా ఉన్నాయో? లేదో? తెలిసిపోతుందనే భావన కలిగించేవి. దీంతో తెలుపు క్రమంగా విలాసానికి కూడా గుర్తుగా మారింది. పర్యాటకం పెరిగేకొద్దీ ఇదే పద్ధతి హోటళ్లలో సాధారణంగా మారింది.

**మనసుపై తెలుపు ప్రభావం**

తెల్లటి బెడ్‌షీట్ కనిపించగానే చాలామందికి శుభ్రత, ప్రశాంతత గుర్తుకొస్తాయి. చక్కగా సర్దిన తెల్లటి మంచం గది శుభ్రంగా ఉందనే భావనను కలిగిస్తుంది. కొత్త ప్రదేశంలో బస చేసే అతిథులకు ఈ తొలి అనుభూతి చాలా ముఖ్యం. హోటల్ గది ఎలా ఉండాలనే దానికి తెల్లటి మంచం దాదాపు ఒక గుర్తుగా మారిపోయింది.

**హోటళ్లకు కూడా లాభమే!**

తెల్లటి వస్త్రాల వల్ల హోటళ్లకు నిర్వహణ సులభమవుతుంది. మరకలు స్పష్టంగా కనిపిస్తాయి. వాటిని వెంటనే ఉతికి శుభ్రం చేయొచ్చు. అవసరమైతే బ్లీచ్ చేసి మరకలను తొలగించవచ్చు. రంగు, డిజైన్ వేర్వేరుగా ఉండే వస్త్రాలను నిర్వహించాల్సిన అవసరం కూడా ఉండదు. ఒకే రకమైన షీట్లు, టవళ్లు వేర్వేరు గదుల్లో ఉపయోగించవచ్చు.

**అన్ని హోటళ్లలో ఒకే అనుభూతి**

ముఖ్యంగా పెద్ద హోటల్ చైన్లకు ఇది ఎంతో ఉపయోగకరం. ఒక నగరంలో ఉన్న హోటల్‌లో కనిపించే తెల్లటి బెడ్‌షీట్, మరో నగరంలో ఉన్న అదే సంస్థ హోటల్‌లోనూ కనిపిస్తుంది. దీంతో అతిథులకు ఎక్కడ బస చేసినా ఒకే తరహా అనుభూతి కలుగుతుంది. తెల్లటి లినెన్ ఆ హోటల్ గుర్తింపులో భాగంగా మారుతుంది.

**అందం కూడా ఒక కారణమే**

తెలుపు గదిని మరింత విశాలంగా కనిపించేలా చేస్తుంది. గదిలోని వెలుతురును కూడా బాగా ప్రతిబింబిస్తుంది. అందుకే గది మరింత హాయిగా, ప్రశాంతంగా అనిపిస్తుంది.

తెల్లటి టవళ్లు, బాత్‌రోబ్‌లు స్పా, విశ్రాంతి భావనను కలిగిస్తాయి. పైగా ఏ రంగు ఫర్నిచర్, డెకరేషన్‌తోనైనా తెలుపు సులభంగా కలిసిపోతుంది. హోటళ్ల ప్రకటనల్లోనూ తెల్లటి మంచానికి ప్రత్యేక స్థానం ఉంటుంది. తెల్లటి దుప్పటి, దిండ్లతో చక్కగా సర్దిన మంచం కనిపించగానే శుభ్రత, సౌకర్యం, విలాసం గుర్తుకొస్తాయి. అందుకే హోటళ్లలో తెల్లటి బెడ్‌షీట్లు ఇప్పుడు సాధారణ వస్త్రాలు కాదు.. ఆతిథ్య రంగానికి ప్రత్యేక గుర్తుగా మారిపోయాయి.

# జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ రాజాబాబు బాధ్యతలు

ఒంగోలు సింధూరదర్శిని: ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ఒంగోలు జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవీకాలం ముగిసినందున రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు బాధ్యతలు అందజేసినందున దానికి అనుగుణంగా బాధ్యతలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ అభివృద్ధి పథకాలను నిరంతరాయంగా జరిగే విధంగా కృషి చేయడం జరుగుతుంది అన్నారు. జిల్లా పరిషత్ అభివృద్ధికి తన వంతు కృషి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కొత్తగా మరల ఎలక్షన్లు జరిగి చైర్మన్‌లను ఎన్నుకునేదాకా



ఈ పదవి కాలం ఉంటుందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాను చూసినట్లయితే 56 మండలాలు 784, 56 ఎంపీటీసీలు ఉన్నాయన్నారు. అప్పటివరకు మండల స్థాయి, జిల్లాస్థాయి అధికారులతో సమన్వయ పరుచుకుని పరిపాలన సాగించడం జరుగుతుందని అదేవిధంగా ప్రభుత్వ పథకాలను త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. పంచాయతీరాజ్‌లో వివిధ రకాల సమస్యలు ఉంటాయని ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా సమస్యలను పరిష్కరించడం జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పంచాయతీ రాజ్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తూ ఎలక్షన్ విధులు నిర్వహించి సజావుగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో ముఖ్య నిర్వహణ అధికారి చిరంజీవితో కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరెవరు ఏ బాధ్యతలు ఏమిటి అని విపులంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ వారిని కలిసి అభినందనలు తెలిపారు.

# ములానీ స్పిన్ మాయ.. కుశాగ్ర సెంచరీ.. ఆసీస్-ఏ పై భారత్-ఏ ఘన విజయం

ఆస్ట్రేలియా-ఏతో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్-ఏ 162 పరుగుల తేడాతో ఘన విజయం

మ్యాచ్‌లో మొత్తం ఏడు వికెట్లతో రాణించిన షామ్స్ ములానీ

తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించిన కుమార్ కుశాగ్రకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'

కెప్టెన్ దేవదత్ పడిక్కల్ అర్ధశతకంతో రెండో ఇన్నింగ్స్‌లో కీలక పాత్ర

భారత బౌలర్ల ధాటికి రెండో ఇన్నింగ్స్‌లో 200 పరుగులకే కుప్పకూలిన ఆస్ట్రేలియా-ఏ



ఆస్ట్రేలియా-ఏతో జరిగిన తొలి నాలుగు రోజుల మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. పుదుచ్చేరి సీఏపీ-సీషెమ్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో 162 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ షామ్స్ ములానీ రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు పడగొట్టి, మ్యాచ్ మొత్తంలో 124 పరుగులిచ్చి 7 వికెట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. 363 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భాగంగా, చివరి రోజైన శుక్రవారం 55/2 ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ ప్రారంభించిన ఆస్ట్రేలియా-ఏ, భారత బౌలర్ల ధాటికి నిలవలేక పోయింది. తొలి గంటలోనే మీడియం పేసర్ అన్షుల్ కంబోజ్, ఓవర్‌నైట్ బ్యాటర్లు నాథన్ మెక్‌స్వీనీ (35), కెప్టెన్ పీటర్ హ్యాండ్స్‌కోంబ్ (16)లను ఔట్ చేసి ఆసీస్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. ఆ తర్వాత పేసర్ తుషార్ దేశ్‌పాండే వరుస బంతుల్లో జోష్ ఫిలిప్, లియామ్ స్కాట్‌లను పెవిలియన్‌కు పంపి పతనాన్ని శాసించాడు. లంచ్ సమయానికి ఆస్ట్రేలియా-ఏ 185/7 స్కోరుతో కష్టాల్లో పడింది. లంచ్ తర్వాత షామ్స్ ములానీ మిగిలిన వికెట్లను పడగొట్టాడు. ఆసీస్ ఇన్నింగ్స్‌లో ఫెర్గస్ ఓ'నీల్ (47) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. చివరికి ఆస్ట్రేలియా-ఏ 55.1 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌట్ అయింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో 163 పరుగుల ఆధిక్యం సాధించిన భారత్-ఏ, తమ రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ దేవదత్ పడిక్కల్ (59) బాధ్యతాయుతమైన అర్ధశతకంతో రాణించాడు. ఓపెనర్ సాయి సుదర్శన్ (39)తో కలిసి పడిక్కల్ రెండో వికెట్‌కు 68 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే, పడిక్కల్ ఔటైన తర్వాత భారత్-ఏ అనూహ్యంగా కుప్పకూలింది. చివరి ఆరు వికెట్లను కేవలం 48 పరుగులకే కోల్పోయి 199 పరుగులకు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న కుమార్ కుశాగ్ర (46 నాటౌట్) చివరి వరకు పోరాడాడు. తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతమైన సెంచరీతో భారత్-ఏ భారీ స్కోరుకు పునాది వేసిన కుమార్ కుశాగ్రకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఇరు జట్ల మధ్య రెండో మ్యాచ్ సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 2 వరకు ఇదే వేదికపై జరగనుంది. ఆ తర్వాత మూడు వన్డేల సిరీస్ కూడా జరగనుంది.

**సంక్షిప్త స్కోర్లు:**

భారత్-ఏ: 334 & 199

ఆస్ట్రేలియా-ఏ: 171 & 200 (ఫెర్గస్ ఓ'నీల్ 47; తుషార్ దేశ్‌పాండే 3-14, షామ్స్ ములానీ 3-57)

# సమ్మె వేళ కస్టమర్లకు ఎస్‌బీఐ ఊరట..

మూడు రోజుల పాటు ఏ బ్యాంకు ఏటీఎం వాడినా చార్జీలుండవ్! - సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె

సమ్మె రోజుల్లో ఏటీఎం లావాదేవీలపై చార్జీలను రద్దు చేసిన ఎస్‌బిఐ - ఏ బ్యాంకు ఏటీఎంలోనైనా కస్టమర్లు ఉచితంగా సేవలు పొందవచ్చని ప్రకటన

డిజిటల్ సేవలు యథావిధిగా పనిచేస్తాయని, వాటిని వాడుకోవాలని సూచన

దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ కస్టమర్లకు ఒక శుభవార్త అందించింది. ప్రతిపాదిత బ్యాంకుల సమ్మె జరగనున్న మూడు రోజుల పాటు ఏటీఎం లావాదేవీలపై ఎలాంటి చార్జీలు వసూలు చేయబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎస్‌బీఐ ఒక ప్రకటన విడుదల చేసింది. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) సెప్టెంబర్ 28 నుంచి 30వ తేదీ వరకు దేశవ్యాప్తంగా మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ సమ్మె కారణంగా వినియోగదారులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఎస్‌బీఐ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. సమ్మె జరిగే ఈ మూడు రోజుల్లో ఎస్‌బీఐ కస్టమర్లు దేశంలోని ఏ బ్యాంకు ఏటీఎంలోనైనా ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా నగదు విత్‌డ్రా చేసుకోవచ్చు లేదా ఇతర




లావాదేవీలు జరపవచ్చు. సమ్మె కాలంలో తమ బ్రాంచ్‌లు తెరిచే ఉంటాయని ఎస్‌బీఐ తెలిపినప్పటికీ, ఉద్యోగుల భాగస్వామ్యాన్ని బట్టి సేవలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంది. అందువల్ల, అత్యవసరమైన బ్రాంచ్ పనులను ముందుగానే పూర్తి చేసుకోవాలని ఖాతాదారులకు సూచించింది. నగదు అవసరాల కోసం ఏటీఎంలతో పాటు ఆటోమేటెడ్ డిపాజిట్ అండ్ విత్‌డ్రాయల్ మెషీన్లు (ఏడీడబ్ల్యూఎం) కూడా అందుబాటులో ఉంటాయని తెలియజేసింది. అదే సమయంలో డిజిటల్ లావాదేవీలకు ఎలాంటి ఆటంకం ఉండదని ఎస్‌బీఐ భరోసా ఇచ్చింది. ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఐఎంపీఎస్, నెఫ్ట్, ఆర్టీజీఎస్ వంటి డిజిటల్ సేవలు యథావిధిగా పనిచేస్తాయని స్పష్టం చేసింది. సాధారణ చెల్లింపులు, నిధుల బదిలీ కోసం ఈ సేవలను వినియోగించుకోవాలని కోరింది. దీంతో పాటు కస్టమర్ సర్వీస్ పాయింట్లు (సీఎస్‌పీఎస్) కూడా కొన్ని రకాల సేవలను అందిస్తాయని వివరించింది. ఖాతాదారులు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని తమ ఆర్థిక కార్యకలాపాలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని ఎస్‌బీఐ విజ్ఞప్తి చేసింది.

# ఏఐకి ఏఐతో శిక్షణ.. కాంట్రాక్ట్ ఉద్యోగులపై ఓపెన్‌ఏఐ చర్యలు




చాట్‌జీపీటీ మోడళ్లకు మానవ స్పందనల ఆధారంగా శిక్షణ

శిక్షణ ఇవ్వడం కోసం వేలాది మంది కాంట్రాక్ట్ సిబ్బందిని నియమించుకున్న ఓపెన్‌ఏఐ

ఏఐకి ఏఐతోనే శిక్షణ ఇచ్చిన కొందరు కాంట్రాక్ట్ ఉద్యోగులు

చాట్‌జీపీటీ మోడళ్లకు మానవ స్పందనల ఆధారంగా శిక్షణ ఇవ్వడానికి నియమించిన కొందరు కాంట్రాక్ట్ ఉద్యోగులు ఏఐనే ఉపయోగిస్తున్నట్లు గుర్తించిన ఓపెన్ ఏఐ, వారిపై చర్యలు తీసుకుంది. మానవులే సమీక్షించాల్సిన పనిని కృత్రిమ మేధతో చేయించడం వల్ల మోడళ్ల నాణ్యత, వైవిధ్యంపై ప్రతికూల ప్రభావం పడొచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. చాట్‌జీపీటీ సమాధానాలను పరిశీలించి, వినియోగదారుల ప్రశ్నలకు మరింత సహజంగా, కచ్చితంగా స్పందించేలా శిక్షణ ఇవ్వడానికి ఓపెన్‌ఏఐ వేలాది మంది కాంట్రాక్ట్ సిబ్బందిని నియమించింది. ఈ పనికి గంటకు 50 డాలర్లు, అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.4,795 వరకు చెల్లిస్తోంది. ఈ ప్రక్రియలో కాంట్రాక్ట్ సిబ్బంది యూజర్ ప్రాంప్ట్‌లను చదివి, ఏఐ ఇచ్చిన స్పందన సరైనదేనా, ప్రశ్నకు సంబంధించిన అంశాలనే కలిగి ఉందా, ఉపయోగకరంగా ఉందా అన్నది అంచనా వేయాలి. ఈ మానవ ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే మోడళ్లు మెరుగైన సమాధానాలు ఇవ్వడం నేర్చుకుంటాయి. ఏఐ తయారుచేసిన కంటెంట్‌తోనే మళ్లీ ఏఐ మోడళ్లకు శిక్షణ ఇస్తే 'మోడల్ కొలాప్స్' ముప్పు ఏర్పడవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకే తరహా డేటా, పదజాలం, నమూనాలు పునరావృతమవుతూ పోతే మోడల్ కొత్త కోణాలను అందుకోవడంలో వెనుకబడవచ్చు. దీంతో సమాధానాల్లో వైవిధ్యం తగ్గడం, వాస్తవ సమాచార కచ్చితత్వం దెబ్బతినడం, కాలక్రమంలో పనితీరు మందగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది.

# ఘనంగా అంగన్వాడీ మాసోత్సవాలు- ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయకుమారి

పెనగలూరు సింధూరదర్శిని: అంగన్వాడీ మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం ఎన్ ఆర్ పురం, ఎన్ ఆర్ పురం దళితవాడ, కోడిచెన్నయ్య గారి పల్లి, పల్లంపాడు అంగన్వాడీ కేంద్రాలలో పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు విడతలుగా ఒక్కొక్క అంగన్వాడీ కేంద్రంలో మూడు రోజులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారులకు అంగన్వాడీ కేంద్రం నుండి లబ్దిదారులకు వచ్చే



వస్తువులు అందుతున్నాయ లేదా అడిగి తెలుసుకున్నారు. వాటి యొక్క ప్రయోజనాలు, అంగన్వాడీలలో నిర్వహించే సామాజిక వేడుకలు, ప్రీ స్కూల్ కార్యక్రమాలు, అలాగే ప్రతి నెలా పిల్లల బరువులు తీసి వారి యొక్క స్థితిని గురించి తల్లులకు వివరించడం జరిగినది. అలాగే స్క్రీనింగ్ యాప్ ద్వారా పిల్లల వివరాలు నమోదు చేయుట గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కె.విజయ లక్ష్మమ్మ, చంద్రకళ, శారద, ఉమాదేవి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# విమానం ఎక్కే ముందు మద్యపానం..

ఎయిరిండియా కో-పైలట్ సస్పెండ్

ఢిల్లీ విమానానికి ముందు మద్యం..

పట్టుబడ్డ ఎయిరిండియా కో-పైలట్

జ్యూరిచ్ ఎయిర్‌పోర్టులో ఆల్కహాల్ టెస్టులో విఫలం

విమానం నుంచి దించివేత.. సర్వీసు ఒకరోజు ఆలస్యం

పైలట్‌ను సస్పెండ్ చేసిన యాజమాన్యం.. విచారణకు ఆదేశం

ఎయిరిండియాలో మరో పైలట్ భద్రతా నిబంధనలను ఉల్లంఘించడం విమానయాన రంగంలో కలకలం రేపింది. స్విట్జర్లాండ్ లోని జ్యూరిచ్ నుంచి ఢిల్లీ రావాల్సిన విమానంలో కో-పైలట్‌గా విధులు నిర్వహించాల్సిన ఒక ఫస్ట్ ఆఫీసర్, విధులకు హాజరయ్యే ముందు మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో యాజమాన్యం అతడిని సస్పెండ్ చేసింది. సెప్టెంబర్ 6న జ్యూరిచ్ విమానాశ్రయంలో ఈ ఉదంతం చోటుచేసుకుంది. జ్యూరిచ్ నుంచి ఢిల్లీకి బయల్దేరాల్సిన ఏఐ 151 విమానంలో విధులు చేపట్టేందుకు సదరు కో-పైలట్ సిద్ధమవుతుండగా, అతని నుంచి మద్యం వాసన రావడాన్ని గ్రౌండ్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అధికారులకు సమాచారం అందించడంతో, అతడికి బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో మద్యం సేవించినట్లు తేలడంతో అతడిని విధులకు అనుమతించకుండా, సాధారణ ప్రయాణికుడిగా భారత్‌కు పంపించి వేశారు. ఈ పరిణామం కారణంగా విమాన సర్వీసును మరుసటి రోజుకు వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ ఘటనపై ఎయిరిండియా యాజమాన్యం తీవ్రంగా స్పందించింది. భద్రత, నియంత్రణ నిబంధనల ఉల్లంఘనల విషయంలో సంస్థ 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తుందని స్పష్టం చేసింది. నిబంధనల అతిక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూనే, సిబ్బందికి నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. కాగా, గత ఆగస్టు 4న ఫుకెట్-ఢిల్లీ విమానంలో ఒక పైలట్ గంజాయి సేవించినట్లు తేలడంతో అతడిని విధుల నుంచి తొలగించిన కొద్ది వారాలకే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ప్రస్తుత ఉదంతంపై స్విస్ ఏవియేషన్ అధికారులు భారత డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)కు సమాచారం అందించారు. జ్యూరిచ్‌లో నిర్వహించిన తుది వైద్య పరీక్షల నివేదిక రావాల్సి ఉందని, అప్పటివరకు సదరు కో-పైలట్‌పై సస్పెన్షన్ కొనసాగుతుందని ఎయిరిండియా ప్రతినిధులు పేర్కొన్నారు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ విచారణకు డిమాండ్..

సుప్రీంకోర్టులో పిటిషన్

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ చర్యలు కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్

ఓటర్ల జాబితా సవరణలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణ

దాదాపు 13 కోట్ల ఓట్లను తొలగించడంపై దర్యాప్తునకు అభ్యర్థన

ఇతర కమిషనర్ల అసమ్మతిని పట్టించుకోలేదని పిటిషన్‌లో వెల్లడి

ప్రజాప్రాతినిధ్య చట్టం కింద విచారణ జరపాలని డిమాండ్



న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ ప్రాసిక్యూషన్ ప్రారంభించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో ఆయన తీసుకున్న పలు నిర్ణయాలు చట్టవిరుద్ధమని ఆరోపిస్తూ అడ్వకేట్ శైలేంద్ర మణి త్రిపాఠి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించాలని ఆయన కోరారు. పిటిషన్‌లోని ప్రధాన డిమాండ్ల ప్రకారం, ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిల అంగీకారం లేకుండా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ జారీ చేసిన మార్గదర్శకాలు, ఆదేశాలు, సాఫ్ట్‌వేర్ మార్పులను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలి. ఓటరు నమోదుకు ఉపయోగించే ఫారం-6లో చేసిన మార్పులను రద్దు చేసి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. దాదాపు 30 రాష్ట్రాలు-కేంద్ర పాలిత ప్రాంతాల్లో సుమారు 13కోట్ల ఓట్లను తొలగించారన్న ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లేదా సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని పిటిషన్‌లో అభ్యర్థించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ మనీశ్ గార్గ్, ఈసీ ఐటీ విభాగం అధిపతి సీమా ఖన్నా తదితరులపై ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 32 కింద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషనర్ డిమాండ్ చేశారు. గత 10 నెలల్లో ఎన్నికల కమిషన్‌లోని ఇతర ఇద్దరు కమిషనర్లు దాదాపు 14 సందర్భాల్లో పలు కీలక నిర్ణయాలపై లిఖితపూర్వకంగా తమ అసమ్మతిని వ్యక్తం చేశారని వెలువడిన మీడియా కథనాలను పిటిషన్‌లో ఉటంకించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా భారీ సంఖ్యలో ఓటర్లను తొలగించారని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు గతంలోనే ఆరోపించాయి. అయితే, కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు సహజమేని, తుది నిర్ణయాలు మాత్రం ఏకాభిప్రాయంతోనే తీసుకున్నామని ఎన్నికల కమిషన్ గతంలో వివరణ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పిటిషన్ దాఖలు దశలో ఉండగా, సుప్రీంకోర్టు దీనిపై ఇకా విచారణ చేపట్టాల్సి ఉంది.

# సినిమా న్యూస్



నటి ప్రగ్యా జైస్వాల్ తన తాజా గ్యాలరీ ఫీచర్‌కి స్వచ్ఛమైన వెకేషన్ ఆనందాన్ని అందించింది, సముద్రం యొక్క అందం మరియు వెల్‌నెస్ రిట్రీట్ యొక్క పునరుజ్జీవన ప్రశాంతత రెండింటినీ సంగ్రహించింది. వెల్‌నెస్ డేని గడుపుతూ, ఇది "మేము అనుభవించిన అత్యంత పునరుజ్జీవన అనుభవం" అని ఆమె పంచుకుంది మరియు ఈ సూర్యుని ముద్దుల క్షణాలలో ఆమె మెరుస్తున్న చిరునవ్వు అన్నింటినీ చెబుతుంది.
వైబ్రెంట్ కో-ఆర్డ్ సెట్‌లో దుస్తులు ధరించి, నటి అప్రయత్నంగా బీచ్ చిక్‌ను ప్రసరిస్తుంది.

## 'అతడు' రోజులొచ్చేశాయ్.. యంగ్ లుక్‌లో మహేశ్.. ఫ్యాన్స్ ఫిదా!

**రాజమౌళి సినిమా షూటింగ్ షెడ్యూల్ పూర్తి చేసుకున్న మహేశ్**

**క్లీన్ షేవ్‌తో హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో సరికొత్తగా దర్శనం**

**మహేశ్ యంగ్ లుక్‌పై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం**

**సినిమాలోని యువకుడి పాత్ర కోసమే ఈ మార్పా అని ఊహాగానాలు**

**'అతడు', 'ఒక్కడు' నాటి లుక్‌ను గుర్తుచేస్తోందని ఫ్యాన్స్ సంబరాలు**



సూపర్ స్టార్ మహేశ్ బాబు తన సరికొత్త లుక్‌తో ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టిస్తున్నారు. కొన్నేళ్లుగా గడ్డంతో రఫ్ లుక్‌లో కనిపించిన ఆయన, తాజాగా పూర్తిగా క్లీన్ షేవ్ చేసి మునుపటి కంటే యంగ్‌గా కనిపించడంతో అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి' షూటింగ్‌లో భాగంగా కాశీ షెడ్యూల్ పూర్తి చేసుకున్న మహేశ్, తాజాగా హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రత్యక్షమయ్యారు. ఆయన కొత్త లుక్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి.

ఎయిర్‌పోర్టులో ఎంతో ఉల్లాసంగా కనిపించిన మహేశ్, తనను ఫొటోలు తీస్తున్న కెమెరాలను చూసి నవ్వుతూ తన గడ్డం వైపు చూపిస్తూ 'గడ్డం లేదు' అన్నట్లుగా చిలిపి సైగలు చేశారు. ఈ దృశ్యాలు చూసిన ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. 51 ఏళ్ల వయసులో కూడా 24ఏళ్ల కాలేజీ కుర్రాడిలా వెలిగిపోతున్నారంటూ నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. చాలా కాలం తర్వాత మహేశ్‌ను ఇలా క్లీన్ షేవ్‌లో చూడటంతో 'అతడు', 'ఒక్కడు' సినిమాల నాటి లుక్ గుర్తొస్తోందని, ఆ రోజులు మళ్లీ వచ్చేశాయని సంబరపడుతున్నారు.

అయితే, మహేశ్‌లో ఈ ఆకస్మిక మార్పు వెనుక బలమైన కారణమే ఉందనే చర్చ సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. రాజమౌళి సినిమా కోసం మహేశ్ గత రెండేళ్లుగా తన శరీరాకృతిని మార్చుకోవడంతో పాటు గడ్డంతో కూడిన రఫ్ గెటప్‌ను కొనసాగిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన రుద్ర అనే ట్రావెలర్‌గా, శ్రీరాముడిగా విభిన్న కోణాల్లో కనిపిస్తారని ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం సినిమాలో దాదాపు 15 నిమిషాల పాటు సాగే ఒక కీలక ఎపిసోడ్‌లో మహేశ్ 24 ఏళ్ల యువకుడిగా కనిపించనున్నారట. ఈ యువకుడి పాత్ర చిత్రీకరణ కోసమే మహేశ్ బాబు క్లీన్ షేవ్ చేసుకున్నారా? లేక కాశీ షెడ్యూల్ ముగియడంతో కాస్త రిలాక్స్ అయ్యేందుకు ఈ లుక్‌లోకి మారారా? అన్నది ఇప్పుడు తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. కారణం ఏదైనా మహేశ్ 'ఏజ్‌లెస్ హ్యాండ్‌సమ్' లుక్ అభిమానులకు పండగలా మారింది. ఈ మార్పు వెనుక ఉన్న అసలు రహస్యం తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చేవరకు వేచి చూడాల్సిందే.

## 'హాయ్' (జీ 5) మూవీ రివ్యూ!



బుల్లి తెరపై నుంచి వెండితెర వరకూ ఎదిగిన నటులలో కెవిన్ రాజ్ ఒకరుగా కనిపిస్తాడు. కథానాయకుడిగా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న కెవిన్, నయనతారతో కలిసి నటించిన సినిమానే 'హాయ్'. విష్ణు దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఆగస్టు 28వ తేదీన విడుదలైంది. రాధిక . ప్రభు .. భాగ్యరాజ్ .. సుహాసిని కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, తమిళంతో పాటు తెలుగు .. కన్నడ .. మలయాళ భాషల్లో ఈ రోజు (సెప్టెంబర్ 25) నుంచి 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది.

సుబ్రమణ్యం (కెవిన్) ఒక రకంగా కలవారి కుటుంబానికి చెందిన అబ్బాయే. ప్రమీల దంపతులు ( రాధిక - భాగ్యరాజ్) సుబ్రమణ్యానికి పెళ్లి సంబంధాలు చూడటం మొదలుపెడతారు. అయితే ప్రేమించి పెళ్లి చేసుకోవాలనేది సుబ్రమణ్యానికి ఉన్న కోరిక. తాను ఇష్టపడిన అమ్మాయిలు తనని ఎంతమాత్రం పట్టించుకోకపోవడం అతనికి చాలా అసంతృప్తిని కలిగిస్తుంది. అందువలన తనకి తగిన అమ్మాయికి కోసం వెతుక్కుంటూ అతను హైదరాబాద్ కి చేరుకుంటాడు. అక్కడే ఒక సంస్థలో జాబ్ చేస్తూ ఉంటాడు. ఇక దేవసేన (నయనతార) తండ్రి చంద్రం (ప్రభు) ఒక తాగుబోతు. భార్య ఇల్లొదిలి వెళ్లిపోయిన దగ్గర నుంచి అతను తాగుడికి బానిస అవుతాడు. తన కోసం భార్య తప్పకుండా తిరిగొస్తుందనే ఆశతో ఎదురుచూస్తూ ఉంటాడు. తాగుడు కోసం అతను చేసిన అప్పు తీర్చమని దొరబాబు ఒత్తిడి చేస్తుంటాడు. లేదంటే దేవసేనను తనకిచ్చి పెళ్లి చేయమని పోరుతుంటాడు. ఈ నేపథ్యంలో దేవసేన పారిపోయి హైదరాబాద్ కి చేరుకుంటుంది. అక్కడే ఆమెకి 'సుబ్బు' తారసపడతాడు. ఇద్దరి మధ్య పరిచయం పెరుగుతుంది.

దేవసేనతో సాన్నిహిత్యం పెరుగుతున్నా కొద్దీ సుబ్బుకి ఆమెపై ప్రేమ పెరిగిపోవడం మొదలవుతుంది. ఆమె పట్ల తనకి గల ప్రేమను బయటపెట్టే సమయం కోసం అతను ఎదురుచూస్తుంటాడు. అయితే సుబ్బు పట్ల దేవసేన స్నేహంగా మాత్రమే ఉంటుంది. జీవితంలో స్థిరపడటం కోసం 'లండన్' వెళ్లే ప్రయత్నాలలో ఉంటుంది. తన మనసులోని మాటను సుబ్బు చెప్పలేడు .. ఆమెను ఆపలేడు. అలాంటి పరిస్థితులలో అతను సతమతమైపోతుంటాడు.

సుబ్బు - దేవసేన లేచిపోయారనీ, ఇద్దరూ కలిసి హైదరాబాద్ లో ఉంటున్నారనే విషయం ఇరు కుటుంబాలకు తెలుస్తుంది. దాంతో వాళ్లంతా ఒక్కసారిగా వచ్చేసి ఇద్దరినీ నిలదీస్తారు. ఆ కంగారులో సుబ్బు, తాను దేవసేనను ప్రేమిస్తున్నాననీ .. తన కారణంగా ఆమె నెల తప్పిందని చెబుతాడు. దాంతో చంద్రం చేసిన అప్పు తీర్చేసి, దేవసేనను తమ కోడలిగా చేసుకోవడానికి ప్రమీల దంపతులు అంగీకరిస్తారు. అప్పుడు దేవసేన ఏం చేస్తుంది? ఆమె తల్లి ఇల్లొదిలి ఎందుకు వెళ్లిపోతుంది? దేవసేన లండన్ వెళ్లిపోతుందా? సుబ్బుతో పెళ్లికి ఒప్పుకుంటుందా? అనేది మిగతా కథ.

ప్రేమించి పెళ్లి చేసుకోవాలనే పట్టుదలతో పట్నానికి వచ్చిన హీరో. నచ్చని పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక పారిపోయి పట్నానికి చేరుకున్న హీరోయిన్ మధ్య పరిచయం జరుగుతుంది. అతని వైపు నుంచి ఆమె పట్ల ఉన్నది ప్రేమ. ఆమె వైపు నుంచి అతని పట్ల ఉన్నది స్నేహం. హీరో తన పేరెంట్స్ తో చెప్పిన ఒక అబద్ధం కారణంగా, అతని ఇంటికి ఆమె వెళ్లవలసి వస్తుంది. అతను చెప్పినట్టుగా నటించాల్సి వస్తుంది. ఫలితంగా చోటుచేసుకునే సన్నివేశాల చుట్టూ అల్లుకున్న కథ ఇది. హీరో .. హీరోయిన్ పారిపోయి చెరో దారిలో హైదరాబాద్ చేరుకోవడం .. అక్కడ ఇద్దరూ తారసపడటం .. వాళ్లిద్దరి మధ్య పరిచయం పెరగడం వంటి సన్నివేశాలతో ఫస్టాఫ్ చాలా సరదాగా .. సందడిగా సాగిపోతుంది. ఇక ఇరువురి కుటుంబాలకు ఈ విషయం తెలియడం, అబ్బాయితో పాటు ఆమెను కూడా తమ ఇంటికి తీసుకుని వెళ్లడం .. తాము చెప్పిన అబద్ధాన్ని నిజం చేయలేక హీరో - హీరోయిన్ నానా తిప్పలు పడటం వంటి మలుపులతో సెకండాఫ్ నడుస్తుంది. పెళ్లి విషయంలో తనకంటూ ఒక అభిప్రాయం ఉన్న హీరో పట్నానికి రావడం, ఇష్టం లేని పెళ్లి చేసుకోలేక అదే పట్నానికి హీరోయిన్ రావడం .. ఇద్దరి మధ్య పరిచయం చాలా సినిమాలలో ఆల్రెడీ చూసేసిన ఒక రొటీన్ ట్రాక్. హీరోయిన్ డబ్బు కోసం ఒక దగ్గర కేర్ టేకర్ గా చేరడం .. ఆ ఫ్యామిలీ ద్వారా లండన్ వెళ్లే ఆలోచన చేయడం .. తనకి ఆమె దూరమైపోతుం దేమోనని హీరో మానసిక సంఘర్షణకి లోను కావడం కూడా మామూలే.

ఇక ఈ కథలో కాస్త గందర గోళం ఏర్పడటానికి కారణం హీరో ఆడిన ఒక అబద్ధం. ఆ అబద్ధం హీరో చెప్పడం కూడా అంత అవసరమని ఆడియన్స్‌కి అనిపించదు. ఈ అబద్ధమే దాదాపు అన్ని పాత్రలను అయోమయంలో పడేసి, అందుకు సంబంధించిన హడావిడితోనే ప్రీ క్లైమాక్స్ కి తీసుకుని వెళ్లి .. అక్కడి నుంచి క్లైమాక్స్ ను చూపిస్తుంది. క్లైమాక్స్ దగ్గరికి వచ్చేసరికి మళ్లీ రొటీన్ బాటనే పట్టడం కనిపిస్తుంది.

చాలా కథలు నడిచిన ఫార్మాట్ లోనే ఈ కథ కూడా వెళుతుంది. అతకని అబద్ధం తప్ప ఎక్కడా కొత్తదనం కనిపించదు. కాకపోతే ట్రీట్మెంట్ కారణంగా, రాధిక .. భాగ్యరాజ్ .. ప్రభు .. సుహాసిని వంటి బలమైన తారాగణం కారణంగా బోర్ అనిపించదు. ప్రధానమైన పాత్రలను పోషించిన నటీనటులంతా సీనియర్స్ కావడం వలన, ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. రాజేశ్ శుక్లా ఫొటోగ్రఫీ .. జీన్ మార్టిన్ సంగీతం .. ఫిలోమిన్ రాజ్ ఎడిటింగ్ ఫరవాలేదు.

ఒకరిని ఇష్టపడటం చాలా తేలిక. అయితే ఆ వ్యక్తి చేత తిరిగి ప్రేమించబడటం చాలా కష్టం. నిజమైన ప్రేమను పొందాలంటే నిరీక్షణ తప్పదు అనే ఒక సందేశం ఈ కథలో మనకి కనిపిస్తుంది.

**సినిమా వివరాలు**

సినిమా పేరు: హాయ్
జానర్: కామెడీ, డ్రామా, రొమాన్స్
విడుదల తేదీ: 2026-09-25
తారాగణం: కవిన్, నయనతార, ప్రభు, కె. భాగ్యరాజ్, రాదికా శరత్‌కుమార్, పూర్ణిమ భాగ్యరాజ్
దర్శకుడు: విష్ణు ఎదవన్
సంగీతం: జెన్ మార్టిన్
బ్యానర్: జీ స్టూడియోస్ - రౌడీ పిక్చర్స్
సమీక్ష: పెద్దింటి
అధిక రేటింగ్: 5కి 2.25

## వెండితెరపై చందమామలాంటి అందం .. కయాదు లోహర్!

**కన్నడ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన కయాదు లోహర్**

**గ్లామరస్ బ్యూటీగా యూత్‌లో క్రేజ్**

**తెలుగు నుంచి పలకరించని సక్సెస్‌లు**

**కోలీవుడ్ లో పెరుగుతున్న అవకాశాలు**

**టాలీవుడ్ పై కూడా దృష్టిపెట్టిన సుందరి**

వెండితెరపై విరిసిన కలువనే 'కయాదు లోహర్' అనేది కుర్రాళ్లు చెప్పుకునే మాట. తమన్నా తరువాత 'మిల్కీ బ్యూటీ' అనే మాట ఏ హీరోయిన్ విషయంలో వాడొచ్చునా అనే ప్రశ్నకి ఆన్సర్ గా కనిపించే రూపమే కయాదు లోహర్. తమన్నాతో పోటీపడే మేనిఛాయతో ఎంట్రీ ఇచ్చిన ఈ సుందరి, అభిమానులను పెద్ద సంఖ్యలో సంపాదించుకోవడానికి ఎక్కువ సమయం తీసుకోలేదు. చక్కని కనుముక్కుతీరుతో పాటు అందుకు తగిన అభినయంతో ఈ బ్యూటీ ఆకట్టుకుంటూ వెళుతోంది. వరుస సినిమాలతో మరింత బిజీ అవుతోంది. సాధారణంగా ఒక భాషలో బిజీ అయిన తరువాతనే హీరోయిన్స్ మరో భాషలోకి ఎంట్రీ ఇస్తుంటారు. అలా కాకుండా వరుసగా వివిధ భాషల్లో అవకాశాలను సంపాదించుకోవడం చాలా తక్కువ మంది హీరోయిన్స్ విషయంలో జరుగుతూ ఉంటుంది. అలాంటి ఒక అరుదైన ఫీట్ కయాదు లోహర్ కూడా సాధ్యం చేసింది. కన్నడ సినిమాతో తన కెరియర్ ను మొదలుపెట్టిన ఈ చందమామ లాంటి అమ్మాయి, తెలుగు .. తమిళ .. మలయాళ .. మరాఠీ భాషలకు పరిచయం కావడానికి ఎక్కువ సమయం తీసుకోకపోవడం విశేషం. తన కెరియర్ ఆరంభంలోనే తెలుగులో శ్రీవిష్ణుతో 'అల్లూరి' .. విష్వక్సేన్ తో 'ఫంకీ' చేసిన 'కయాదు లోహర్'కి ఆ సినిమాలు సరిగ్గా ఆడక పోవడం వలన సరైన గుర్తింపురాలేదు. ఆ తరువాతనే యూత్ లో ఆమె క్రేజ్ పెరుగుతూ వెళ్లింది. ఇప్పుడు తమిళ .. మలయాళ ప్రాజెక్టులతో ఆమె ఫుల్ బిజీ. ఈ నేపథ్యంలోనే తెలుగులో ఆమె చేసిన మరో సినిమాగా 'ది ప్యారడైజ్' నిన్న థియేటర్లకు వచ్చింది. ఈ సినిమాలో కనిపించినంత సేపు తన అందంతో ఆమె ఆకట్టుకుంది. కాకపోతే ఆమె పాత్రకి సరైన ప్రాధాన్యత లేకపోవడం అభిమానులకు అసంతృప్తిని కలిగించింది. కయాదు గ్లామర్ కి తగిన సరైన ప్రాజెక్టులు .. పాత్రలు పడితే, తెలుగులోను ఆమె బిజీ కావడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది. ఆ రోజు త్వరలోనే వస్తుందేమో చూడాలి మరి.



Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662